క్లుప్తంగా

పసుపు కొమ్ములతో గ్రామ దేవతకు అలంకరణ



దొడ్డి గంగాలమ్మ

మామిడికుదురు: శ్రావణ మాసంలో అమ్మవార్లను విశేషంగా అలంకరించడం ఆనవాయితీ. పవిత్రమైన ఈ మాసంలో మొదటి రోజే శ్రావణ శుక్రవారం రావడంతో నగరం గ్రామస్తులు తమ గ్రామదేవత దొడ్డి గంగాలమ్మకు పసుపు కొమ్ములతో విశేషంగా అలంకరణ చేశారు. రంగు రంగుల పసుపు కొమ్ములను దండగా గుచ్చి అమ్మవారి మెడలో మాలగా వేశారు. అమ్మ వారికి స్థానిక మహిళలు పలు ప్రత్యేక పూజలు చేశారు. పసుపు కొమ్ములతో అలంకరించిన దొడ్డి గంగాలమ్మను విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ముడుపులు, మొక్కులు చెల్లించారు.

కుట్టుశిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



చొప్పెల్లలో కుట్టుశిక్షణ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజు

ఆలమూరు: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థిక స్వావలంబన కోసం అందిస్తున్న కుట్టు శిక్షణను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ బి.రాజు అన్నారు. మండలంలోని చొప్పెల్లలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. మహిళలు దుస్తులు కుట్టే విధానాన్ని పరిశీలించి పలు సూచనలు, సలహాలు అందజేశారు. నిర్ణీత కాలంలో శిక్షణను పూర్తి చేసి స్వయం సమృద్ధిని సాధించాలని ఆయన ఆకాంక్షించారు. కుట్టుశిక్షణ పూర్తయిన మహిళలకు ప్రభుత్వం అందించబోయే రాయితీల వివరాలను తెలియజేశారు.

అతిథి అధ్యాపకుడి పోస్టుకు దరఖాస్తులు

రావులపాలెం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ సబ్జెక్ట్ బోధించుటకు అతిథి అధ్యాపకుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు తెలిపారు. ఆ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఫిజిక్స్ సబ్జెక్టు పీజీ డిగ్రీలో 55 శాతం మార్కులు కలిగిన ఆసక్తి గల అభ్యర్థులు తమ తమ దరఖాస్తులను ఈ నెల 29 లేదా సాయంత్రం 5 గంటల లోపు కళాశాల కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు. 31వ తేదీ ఉదయం 11 గంటలకు కళాశాలలో జరుగు ఇంటర్వ్యూకు అభ్యర్థులు తమ ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని, నెట్, సెట్, పీహెచ్‌డీ అర్హతలు గల అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ఇతర వివరాలకు 7995875308, 9949135863 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

హార్బర్‌కు చేరుకున్న వేటబోట్లు



పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌లో నిలుపుదల చేసిన సోనా బోట్లు

సఖినేటిపల్లి: పల్లిపాలెం ఫిషింగ్ హార్బర్‌కు శుక్రవారం సముద్రంపై వేట సాగించే బోట్లు చేరుకున్నాయి. బంగాళాఖాతంలో తీవ్ర తుపాను ప్రభావంతో తలెత్తిన ప్రతికూల వాతావరణం వల్ల మత్స్యకారులు తమ, తమ బోట్లును హార్బర్‌కు చేర్చారు. ఇందులో ప్రధానంగా లోతు జలాల్లో రోజులు తరబడి వేట సాగించే సోనా బోట్లతో పాటు ఇతర సాధారణ బోట్లు కూడా హార్బర్‌కు చేర్చారు. మత్స్యశాఖ, మెరైన్ పోలీసు శాఖ మత్స్యకారులకు ముందస్తు జాగ్రత్తలపై పలు సూచనలు చేశారు.

ప్రమాదకరంగా కొర్లగుంట ఏటిగట్టు రోడ్డు



ప్రమాదకరంగా మారిన ఏటిగట్టు రోడ్డు

మామిడికుదురు: మామిడికుదురు శివారు కొర్లగుంట ఏటిగట్టు రోడ్డు ప్రమాదకరంగా మారింది. కొర్లగుంట నుంచి ఏటిగట్టు ఎక్కి అప్పనపల్లి వెళ్లాలంటే భయమేస్తోందంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 200 మీటర్ల మేర రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాపోతున్నారు. మహిళలు అయితే మోటారుసైకిళ్లు నడిపించుకుని వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇక్కడ పరిస్థితి జారుడు బల్లను తలపిస్తోంది. పాలకులు ఎంతో అభివృద్ధి చేశామంటూ ప్రకటనలు ఇస్తున్నారు తప్ప ఈ రోడ్డు పరిస్థితి మాత్రం వారికి కనిపించడం లేదా అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డుపైన భారీగా మట్టి చేరడం, పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ఇక్కడ పరిస్థితి అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణం స్పందించి ఈ రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

కౌశిక ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి



కొత్తపేటలో కౌశిక గట్టు ఆక్రమణదారులకు నోటీసులు అందజేస్తున్న రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది



కొత్తపేటలో కౌశిక గట్టు ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

- 320 ఆక్రమణల గుర్తింపు
- ఆక్రమణదారులకు అధికారుల నోటీసులు

కొత్తపేట: స్థానిక కౌశిక డ్రైన్ మురుగు పారేందుకు అడ్డుగా ఉన్న ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకోవాలని రెవెన్యూ, పంచాయతీ అధికారులు ఆక్రమణదారులకు సూచించారు. కొత్తపేట పరిసర ప్రాంతాల్లో పంట భూములు, నివాసాల మురుగు నీరు దిగేందుకు ప్రధానమైన కౌశికలో తూడు, చెత్త, పూడికను ఒక జేసీబీతో తొలగింపు చర్యలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ పనులకు పలుచోట్ల ఆక్రమణలు అడ్డంకిగా ఉన్నాయని స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు నివేదించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక ఆర్‌డీఓ పి.శ్రీకర్ పర్యవేక్షణలో తహసీల్దార్ రాంబాబు, పంచాయతీ సెక్రటరీ డి.వెంకటేశ్వరరావు స్థానిక పంచాయతీ పరిధిలోని కౌశిక ఆక్రమణలను పరిశీలించి, ఆక్రమణదారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు ఇప్పటికే పలు ఆక్రమణలు తొలగించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సభ నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీ దాసరి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో సర్పంచ్ బూసి జయలక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో తహసీల్దార్ వై.రాంబాబు పాల్గొన్నారు. గ్రామ సభ ప్రధానంగా కౌశిక ఆక్రమణలపై సాగింది. అధికారులు మాట్లాడుతూ బోడిపాలెం, బి.సావరం వైపు నుంచి పలివెల వరకూ ఆక్రమణల సర్వే జరిపి, 320 ఆక్రమణలుగా గుర్తించామన్నారు. వరుసగా నోటీసులు ఇస్తున్నామని, ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగింపునకు రెండు రోజులు గడువు ఇచ్చామన్నారు. ఇకపై ఆక్రమణ స్థలాల్లో షాపులు, ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం గాని, ఇంటి పన్ను వేయడం గాని జరగదని తెలిపారు. ఈ సభలో ఉప సర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, పలువురు పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

బకాయిలు వెంటనే విడుదల చేయాలి

కొత్తపేట: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగస్తులకు చెల్లించాల్సిన రూ.25 వేల కోట్ల బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు మద్దాల బాపూజీ డిమాండ్ చేశారు. కొత్తపేట తాలూకా ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గం ఎన్నికకు సంబంధించి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగుల సమావేశం శుక్రవారం జిల్లా అధ్యక్షుడు బాపూజీ అధ్యక్షతన జరిగింది. ఆయన మాట్లాడుతూ పీఆర్‌సీ కమిటీ ఏర్పాటు చేయాలని, పెండింగ్ డీఏ బకాయిలు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లాలో అర్బన్, రూరల్ ప్రాంతాల సచివాలయ ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారని బాపూజీ ఆందోళన వ్యక్తం చేశారు. సెలవు దినాల్లో కూడా ఉద్యోగులతో పని చేయించుకోవడం అన్యాయం అన్నారు. ప్రాపర్టీ టాక్స్, ఫీల్డ్ వర్క్ పేరుతో నిర్బంధించి పనిచేయించడం ఉద్యోగుల హక్కులను కాలరాయడమేనని అన్నారు. సమస్యల పరిష్కారం కోసం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాకిభట్ల రామసూర్య నారాయణ నాయకత్వంలో రాష్ట్రంలో 8 లక్షల మంది ఉద్యోగులతో ఐక్యంగా ముందుకు సాగాల్సిన సమయం ఆసన్నమైందని పిలుపునిచ్చారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వీరబాబు, జిల్లా కోశాధికారి ఎస్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాట కార్యక్రమాన్ని పిలుపునిస్తామని, అందరూ సిద్ధం కావాలన్నారు. అన్ని ప్రభుత్వ శాఖలలో ఉద్యోగులు అందరూ ఏపీజీఈఏ సభ్యులుగా చేరాలని వారు పిలుపునిచ్చారు.



కొత్తపేటలో నూతన కార్యవర్గాన్ని అభినందిస్తున్న జిల్లా ప్రెసిడెంట్ బాపూజీ

ఏకగ్రీవంగా తాలూకా నూతన కార్యవర్గ ఎన్నిక

జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె.వీరబాబు ఎన్నికల అధికారిగా తాలూకా (కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం మండలాలు) నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం ప్రెసిడెంట్‌గా వాడ సద్గుణరావు (వైద్య ఆరోగ్యశాఖ-అవిడి పీహెచ్‌సీ, కొత్తపేట మండలం), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎ.శ్రీనివాస్ (రెవెన్యూ), వైస్ ప్రెసిడెంట్స్‌గా జి.పద్మకుమారి, ఎం.అనిల్‌కుమార్, గుత్తుల వెంకటరమణ (వైద్య ఆరోగ్యశాఖ), కె.లక్ష్మీపతి (రెవెన్యూ), ఎ.సునీల్ (ఐసీడీఎస్), సెక్రటరీగా ఆర్‌డీఆర్‌సీహెచ్ మూర్తి (రెవెన్యూ), ఆర్గనైజింగ్ సెక్రటరీ పీడీఎస్ శేషగిరిబాబు (రెవెన్యూ), జాయింట్ సెక్రటరీగా చింతం బాబ్జి (రెవెన్యూ), జీవీవీ సత్యనారాయణ, పి.శ్రీవెంకట శ్రీనివాసరావు (వైద్య ఆరోగ్య శాఖ) కె.శ్రీనిబాబు (ఎక్సైజ్), వి.పరంజ్యోతి (రెవెన్యూ), ట్రెజరర్‌గా వి.రాధాకృష్ణ (వైద్య ఆరోగ్య శాఖ)లను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడు బాపూజీ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వారిని కమిటీ సభ్యులు పూలమాలలతో అభినందించారు.

పార్టీ బలోపేతానికి కమిటీల ఏర్పాటు



ఉయ్యూరువారిమెరకలో నూతన గ్రామ శాఖ కమిటీ సభ్యులతో నాయకులు



ఏకగ్రీవంగా ఎన్నికైన శివకోటి గ్రామ కమిటీ

సఖినేటిపల్లి: వైఎస్సార్ సీపీ బలోపేతానికి గ్రామ స్థాయిలో ఆ పార్టీ రాజోలు నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొల్లపల్లి సూర్యారావు సారథ్యంలో మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ నేతృత్వంలో కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో కమిటీలు ఏకగ్రీవంగా శుక్రవారం ఎన్నుకున్నారు. ఉయ్యూరువారి మెరకలో నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా కారుపర్తి భాస్కర నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మేడిది వెంకట రెడ్డి, శృంగవరప్పాడులో నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా గెడ్డం సూర్యారావు, ప్రధాన కార్యదర్శిగా మద్దాల కృష్ణమూర్తి ఎన్నుకున్నారు. అలాగే టేకిశెట్టిపాలెంలో నూతన గ్రామ శాఖ అధ్యక్షుడిగా జిల్లెళ్ళ ఆనంద్(చిట్టి), ప్రధాన కార్యదర్శిగా ఇంజేటి సుమంత్ ఎన్నుకున్నారు. పార్టీ వివిధ విభాగాల రాష్ట్ర, జిల్లా, మండల ప్రతినిధులు రుద్రరాజు చినరాజా, తాడి సహదేవ్, దొంగ ఏసు, ఈద రవిరెడ్డి, దివ్వి చిట్టిబాబు, నాయకులు ఉప్పు సోమరాజు, చింతా సుధాకర్‌రావు, ఓగూరి బాబులు, ఇనుమర్తి వీరనాగరాజు, రావి త్రిమూర్తులు, ఇంజేటి శామ్యూల్ రాజు, గుబ్బల సత్యనారాయణ, గెడ్డం సువర్ణరాజు, కొల్లు తాతారావు, కుసుమ రాజు, నల్లి రాజ్‌కుమార్, కె.నరేష్ పాల్గొన్నారు.

రాజోలులో..

రాజోలు: క్షేత్రస్థాయిలో వైఎస్సార్ సీపీని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర పార్టీ సూచనల మేరకు గ్రామ కమిటీల నియామకాలు వేగంగా జరుగుతున్నాయని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శుక్రవారం చింతలపల్లి, శివకోటి గ్రామాల్లో మండల అధ్యక్షుడు కట్టా శ్రీనివాసరావు, కమిటీలను జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు కూనపరెడ్డి రాంబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొల్లాబత్తుల సతీష్‌బాబు, వలంటీర్ విభాగం అధ్యక్షుడు ఉచ్చుల దాసు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మాజీ సర్పంచ్‌లు తులా సత్యనారాయణ, గెడ్డం సత్యనారాయణ తదితర నాయకుల సమక్షంలో చింతలపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా నాగబాబు, కార్యదర్శిగా రామకృష్ణ ఎన్నికయ్యారు. అలాగే శివకోటి గ్రామశాఖ అధ్యక్షుడిగా పితాని నాగరాజు స్వామి, ప్రధాన కార్యదర్శులుగా దూది మురళీకృష్ణ, రావి విజయ్, వల్లూరి మాధవశంకర్, తాడి సత్యనారాయణ, కార్యదర్శులుగా కాండ్రేగుల శ్రీనివాసరావు, జి.రామారావు, గెడ్డం బాలశేఖర్‌లు ఎన్నికయ్యారు. కార్మిక విభాగం అధ్యక్షుడు పితాని సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ గెద్దాడ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో నో బ్యాక్ బెంచ్

రావులపాలెం: మండలంలోని రావులపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు తొలిసారిగా నో బ్యాక్ బెంచ్ విధానాన్ని అనుసరించారు. సాధారణంగా సరిగ్గా చదవని అల్లరి బాగా చేసేవాడిని బ్యాక్ బెంచ్‌లో కూర్చుని బట్టి పట్టించేవారు. ఆ ఆనవాయితీకి స్వస్తి చెప్పి ఆధునిక కాలంలో వినూత్నంగా ఆలోచిస్తున్నారు ఉపాధ్యాయులు. విద్యార్థులు కూర్చునే బెంచీలు యూ ఆకారంలో అమర్చే పద్ధతి మొదలుపెట్టారు. ఇదే తరహా క్లాసులు కేరళలో మొదట చేపట్టగా అది మంచి ఫలితాలు తీసుకొచ్చింది. ఇటీవల తిరుపతి జిల్లాలో కూడా ఈ తరహా ప్రయోగం చేసి సక్సెస్ అయ్యారు. ఆ విధానాన్ని రావులపాలెం మండలంలోని రావులపాడు గ్రామం పాఠశాల ఉపాధ్యాయులు ఆదర్శంగా తీసుకుని బ్యాక్ బెంచ్‌కి స్వస్తి చెప్పి యు ఆకారంలో బెంచీలను సెట్ చేసి అందరి విద్యార్థులు ముఖాలు స్పష్టంగా కనిపించేటట్టు తరగతిని నిర్వహించి బోధన చేపట్టారు. దీంతో విద్యార్థులు మానసిక పరిస్థితిని తెలుసుకొని అందరితో సమానంగా పోటీపడి చదివేటట్లు వినూత్న తరహా ప్రయోగం చేపట్టామని ఆ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడు మధుసూదనరావు అన్నారు. ఎంఈఓ శ్రీనివాసరాజు మాట్లాడుతూ జిల్లాలో ప్రయోగాత్మకంగా యు ఆకారంలో సిట్టింగ్ ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా చేపట్టిన ఈ తరహా విద్యాబోధన మంచి ఫలితాలను ఇస్తుంది అనడం ఏ మాత్రం సందేహం లేదన్నారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో త్వరలోనే ఈ తరహా విద్యాబోధనకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మట్ట సత్యవతి, ఉపాధ్యాయులు, జీవీ గిరి, ఎస్.జ్యోతిబసు, కేవీ శేఖర్, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.



రావులపాడు పాఠశాలలో యూ ఆకారంలో అమర్చిన బెంచీలపై విద్యార్థులతో ఎంఈఓ

గ్రామాల అభివృద్ధికి కెనరా బ్యాంకు సాయం

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురంలో మేరీ మాత వృద్ధుల ఆశ్రమ అభివృద్ధి నిమిత్తం స్థానిక కెనరా బ్యాంకు సీఎస్ఆర్ నిధుల నుంచి రూ.8 లక్షలు ఆర్థిక సాయం అందించింది. అలాగే మట్టపర్రులో తాగునీటి సౌకర్యానికి రూ.5 లక్షలు అందించింది

ఈ మేరకు కెనరా బ్యాంక్ ఎండీ, సీఈఓ కలిదిండి సత్యనారాయణరాజు నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు బ్యాంకు లక్కవరం బ్రాంచ్ వ్యవస్థాపకుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు శుక్రవారం తెలిపారు. గతంలో లక్కవరంలో ఉన్న సరస్వతి శిశు మందిర్ హైస్కూల్ అభివృద్ధి నిమిత్తం రూ.12 లక్షలను ఇచ్చినట్లు ఆయన వివరించారు. కెనరా బ్యాంక్ నిధుల నుంచి నిధులు మంజూరు చేసిన ఎండీ సత్యనారాయణరాజు బెంగళూరు హెడ్ ఆఫీస్‌లో వ్యవస్థాపకులు, లక్కవరం చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు శాలువా కప్పి, బొకేతో ఘనంగా సత్కరించారు.



బ్యాంకు ఎండీ సత్యనారాయణరాజును సత్కరిస్తున్న గోపాలకృష్ణంరాజు

రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యం

అంబాజీపేట: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన రహదారుల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. ఇసుకపూడి ప్రధాన రహదారి నిర్మాణానికి సర్పంచ్ తరపట్ల మోహన్‌సింగ్‌బాబురావు అధ్యక్షతన ఎమ్మెల్యే శుక్రవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాబార్డు నిధులు రూ.1.25 కోట్లతో 1.7 కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రోడ్‌ను నిర్మించనున్నామన్నారు. గత 20 ఏళ్లకు పైబడి నిర్మాణానికి నోచుకోని ఈ రహదారి ఎట్టకేలకు అభివృద్ధి చెందనుంది. అనంతరం ఎమ్మెల్యే సత్యనారాయణను స్థానికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఎంపీటీసీ ముత్తాబత్తుల ప్రశాంత్, పంచాయతీ రాజ్ జేఈ సంపన్, ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎఎస్ఎల్.నరసింహం, డిప్యూటీ ఎంపీడీఓ కె.శ్రీనివాస్, శిరిగినీడి వెంకటేశ్వరరావు, పెదిరెడ్డి వెంకటేశ్వరరావు, దాసరి వీరవెంకట సత్యనారాయణ పాల్గొన్నారు.



ఇసుకపూడిలో రోడ్డు నిర్మాణానికి శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

రోగికి ఆర్థిక సాయం



ఈదరాడలో సహాయం అందజేస్తున్న మానవతామూర్తులు ప్రతినిధులు

మామిడికుదురు: ఈదరాడలోని కమ్మవారిలంకకు చెందిన పెదపూడి చంద్రశేఖర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. నిరుపేద కుటుంబానికి చెందిన అతనికి మానవతా మూర్తులు గ్రూపు ఆధ్వర్యంలో శుక్రవారం రూ.2,500 ఆర్థిక సాయం అందించారు. చంద్రశేఖర్ అనారోగ్య పరిస్థితిని హైదరాబాద్‌లో ఉంటున్న లక్కవరం వాసి శృంగారపు సత్యనారాయణమూర్తికి తెలియ పర్చగా అతను స్పందించి ఈ సాయాన్ని పంపించారని చెప్పారు. ఈ సహాయాన్ని మానవతామూర్తుల సంఘం ప్రతినిధులు బోనం రాజు, మేడిచర్ల వెంకటేశ్వరరావు, యెరుబండి చిన్ని చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా దాతను అభినందించారు.



ఉయ్యూరువారి మెరకలో బాధితుడి కుటుంబానికి సాయం చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉయ్యూరివారి మెరకలో..

సఖినేటిపల్లి: మండలంలోని ఉయ్యూరువారి మెరకలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గుర్రం రోహిత్‌కు, గల్ఫ్ గృహ కార్మికుల హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు శుక్రవారం రూ.15 వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు పై మొత్తాన్ని బాధితుడి కుటుంబ సభ్యులకు సదరు సంస్థ స్థానిక సభ్యులు ఇంటి వద్ద అందజేశారు. పాస్టర్ రత్నమోహన్, నక్కా రామారావు, నల్లి ప్రసాదరావు, గుర్రం సాల్మన్‌రాజు, నక్కా ప్రభావతి, గుర్రం కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ విజ్ఞతతో మాట్లాడాలి

మలికిపురం: డీసీఎం పవన్‌కల్యాణ్ విజ్ఞతతో మాట్లాడాలని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మంగెన సింహాద్రి పేర్కొన్నారు. ఆయన లక్కవరంలో శుక్రవారం మాట్లాడుతూ మీ జనసేన కార్యకర్తలని రెచ్చగొట్టడం ద్వారా విద్వేషం కలిగిస్తున్నారని అన్నారు. ఇప్పటికే మీ అభిమానులు చాలా అసభ్య పదజాలంతో, దౌర్జన్యాలతో ప్రజలమీద దాడి చేస్తూ పోతున్నారు. సుగాలి ప్రీతి కేసు, 30 వేల మంది మహిళలు ఏమైపోయారో అంటూ ఎలక్షన్‌కు ముందు చేసిన ప్రకటనలు గుర్తు చేసుకోవాలన్నారు. ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలు సూపర్‌సిక్స్ అమలయ్యే విధంగా సీఎం చంద్రబాబు నాయుడు మీద ఒత్తిడి తేవాలన్నారు.

చించినాడ నుంచి బస్సు సౌకర్యం

రాజోలు: దిండి-చించినాడ వంతెన మరమ్మతులు పురస్కరించుకుని పాలకొల్లు, భీమవరం ప్రాంతాలకు చించినాడ గ్రామం నుంచి ప్రత్యేక బస్సు సౌకర్యం కల్పించామని రాజోలు ఆర్టీసీ డిపో మేనేజర్ ధనమ్మ శుక్రవారం తెలిపారు. అమలాపురం నుంచి దిండి చెక్ పోస్టు వరకు బస్సులు నడుస్తాయన్నారు. వంతెన అవతల చించినాడ గ్రామం నుంచి ప్రతి 45 నిముషాలకు పాలకొల్లు, భీమవరం ప్రాంతాలకు బస్ సర్వీసులు సిద్ధంగా ఉంటాయన్నారు. అలాగే శంషాబాద్, విజయవాడ, జీడిమెట్ల, ఈసీఐఎల్ సర్వీసులు రావులపాలెం, సిద్ధాంతం, పాలకొల్లు, భీమవరం మీదుగా ప్రయాణిస్తాయన్నారు.

బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడిగా చీకరమెల్లి

పి.గన్నవరం: బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బెల్లంపూడి గ్రామానికి చెందిన చీకరమెల్లి శ్రీనివాసరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధిష్టానం నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. తన నియామకానికి కృషి చేసిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీవేమా, జిల్లా పార్టీ అధ్యక్షుడు అడబాల సత్యనారాయణ తదితరులకు శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



అయినవిల్లిలో కుంకుమ పూజలు

మామిడికుదురు: శ్రావణ మాసం ప్రారంభం కావడంతో అమ్మవారి ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. లక్ష్మీదేవి అనుగ్రహం పొందడంతో పాటు సుఖ సంతోషాలు, ఐశ్వర్యంతో పాటు దీర్ఘ సుమంగళీ యోగం సిద్ధించాలని కోరుతూ మహిళలు వరలక్ష్మీ వ్రతం ఆచరించారు. అప్పనపల్లి మొల్లేటివారిపాలెం రామాలయం ప్రాంగణంలో ఉచిత సామూహిక వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. శుక్రవారం కావడంతో అధిక సంఖ్యలో మహిళలు వరలక్ష్మీ దేవిని ఆరాధిస్తూ పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా పూజా సామగ్రిని అందించారు. అర్చకులు బొక్కా ఫణీంద్ర ఆధ్వర్యంలో వరలక్ష్మీ దేవికి వైభవంగా పూజలు జరిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కాండ్రేగుల శ్రీనివాసు, కార్యదర్శి మొల్లేటి సురేష్, సమరసతా వేదిక ప్రతినిధి బిరిశెట్టి కోటేశ్వరరావు భక్తులకు ఏర్పాట్లు చేశారు.



అప్పనపల్లిలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు

పద్మావతి అమ్మవారికి కుంకుమ పూజలు

అయినవిల్లి: మండలంలోని నల్లచెరువులో వేంచేసిన పద్మావతి, గోదాదేవి సమేత సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శ్రావణ మాసం మొదటి శుక్రవారం కావడంతో పద్మావతి అమ్మవారికి కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు కల్యాణ్ ఆచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష పూజలు జరిపారు. అనంతరం సహస్ర కుంకుమ పూజలు జరిపారు. ఈ పూజల్లో మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అయినవిల్లి అన్నపూర్ణదేవి, ముక్తేశ్వరం ముక్తికాంత అమ్మవారికి, లక్ష్మీదేవి అమ్మవారికి విశేష కుంకుమ పూజలు జరిపారు.



అంతర్వేది ఆలయంలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు

అంతర్వేదిలో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలోని ఉపాలయంలో కొలువైన రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మి కుంకుమ పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం మొదటి శుక్రవారం పర్వదినాన ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఎంకేటీఎన్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్ నేతృత్వంలో ఆలయ అర్చకుడు ఎస్‌బీఎం రామకృష్ణమాచార్యులు ఈ కుంకుమ పూజలు చేయించారు. తొలుత అమ్మవారి సన్నిధిలో అధిక సంఖ్యలో మహిళా భక్తులు బారులు తీరారు. దేవస్థానం తరఫున ఎటువంటి పూజా రుసుం లేకుండా అమ్మవారి రూపు, పూజా సామగ్రి వారికి సిబ్బంది అందజేశారు. రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారికి పూజలు అనంతరం లక్ష్మీనృసింహస్వామి దర్శనం, ప్రసాద వితరణ అర్చకులు చేశారు. తదనంతరం నిత్యాన్నదానంలో భక్తులకు భోజన వసతి కల్పించారు.



ఆత్రేయపురంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ఆత్రేయపురంలో..

కొత్తపేట: ఆత్రేయపురం లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో గ్రామ మహిళలు సామూహిక కుంకుమ పూజలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వివిధ పూజలు వైభవంగా నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అలాగే కొత్తపేట, ఆత్రేయపురం మండలాల్లో మహిళలు లక్ష్మీదేవికి తొలి శుక్రవారం పూజలు, పలు అమ్మవారి ఆలయాల్లో సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

తాలూకాలో ఎన్జీవోలు సభ్యత్వం తీసుకోవాలి

కొత్తపేట: ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ తాలూకా యూనిట్ ఎన్నికలు త్వరలో జరగనున్న నేపథ్యంలో ఉద్యోగులు అందరూ సంఘ సభ్యత్వం తీసుకోవాలని తాలూకా యూనిట్ అధ్యక్షుడు మోటూరి రామారావు కోరారు. ఆ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాలూకా పరిధిలోని కొత్తపేట, రావులపాలెం, ఆత్రేయపురం, పి.గన్నవరం, ఆలమూరు మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల సంఘం సభ్యత్వం కోరకు కార్యదర్శిని కొత్తపేట ఎన్జీవో హోంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మలికిపురం: మండలంలోని విశ్వేశ్వరాయపురం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన చెక్కులను బాధితులకు పంపిణీ చేశారు. ఈ మేరకు నియోజకవర్గంలో 30 మంది లబ్ధిదారులకు మంజూరు కాబడిన రూ.32,06,271 విలువైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఇప్పటి వరకూ 375 మంది బాధిత కుటుంబాలకు రూ.3.38 కోట్ల మొత్తాన్ని చెక్కుల రూపంలో పంపిణీ చేశామని తెలిపారు. ఎన్డీఏ కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.